నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, శనివారం 17 మే 2025 | BHADRADRI KOTHAGUDEM



జూలూరుపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, నిరుపేదలు

# ఇందిరమ్మ ఇండ్ల కోసం ధర్నా

## అర్హులందరికీ మంజూరు చేయాలి : సీపీఎం డిమాండ్

జూలూరుపాడు, మే 16 : అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో జూలూరుపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరుపేదలు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పారదర్శకత లోపించిందన్నారు. నిరుపేదలు, సెంటు భూమిలేని వితంతువులకు మొదటి జాబితాలో చోటు ఇవ్వకుండా.. భూములు, ఆస్తులు ఉన్న వారికి మెదటి జాబితాలో ఇండ్లను కేటాయించడం అర్హులను మోసం చేయడమే అవుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటినా ఇప్పటివరకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదని ఆరోపించారు. వెంటనే అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బానోత్ ఈశ్వర్, గార్లపాటి వెంకటి, పద్దం సుగుణ, వల్లమల చందర్‌రావు, రెడ్డిబోయిన గోవిందు, ఇల్లంగి సీతారాములు, బోడ అభిమిత్ర, జల్లిక రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పశువుల అక్రమ రవాణాకు చెక్

- పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏడు చెక్‌పోస్టులు
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీ సునీల్ దత్



వెంకటగిరి క్రాస్ రోడ్డు వద్ద చెక్‌పోస్టులో పోలీసులు

మామిళ్లగూడెం, మే 16 : పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు సీపీ సునీల్‌దత్ తెలిపారు. పోలీస్ కమిషరేట్ పరిధిలోని అధికారులతో శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 24x7 నిరంతర పర్యవేక్షణ ఉండే విధంగా జిల్లా, రాష్ట్రాల సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్ పోస్టులలో పోలీస్, పశుసంవర్ధక శాఖ సిబ్బందితో షిఫ్టుల వారీగా సమన్వయంతో పని చేస్తారని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ముందస్తు చర్యల్లో భాగంగా పశువుల రవాణా విషయంలో వివాదాలు తలెత్తకుండా ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా జంతువుల అక్రమ రవాణా, గోవధ విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధానంగా బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల రవాణా విషయంలో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, పశువులను అక్రమంగా తరలించే వాహనాలు పట్టుబడితే వెంటనే వాటిని సీజ్ చేయాలని ఆదేశించారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి రవాణా అయ్యే పశువుల విషయంలో నియమ నిబంధనలను తప్పక పరిశీలించాలని సూచించారు. పండుగల సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమాల ద్వారా మత సామరస్యానికి భంగం కలిగించే విధంగా విద్వేషాలు, రెచ్చగొట్టే అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు మీడియా మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సరిహద్దు చెక్‌పోస్టులు.. పాలడుగు(వైరా), బస్వాపురం క్రాస్ రోడ్డు(కొణిజర్ల), హనుమాన్ తండా(కల్లూరు), వెంకటగిరి క్రాస్ రోడ్డు(ఖమ్మం రూరల్), సుబ్లేడు క్రాస్ రోడ్డు(తిరుమలాయపాలెం), పాలేరు సింగరేణిపల్లి టోల్ ప్లాజా(కూసుమంచి), వల్లభి(ముదిగొండ) వద్ద ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

# జీఎంలతో సింగరేణి సీఎండీ సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న సీఎండీ బలరాం

కొత్తగూడెం సింగరేణి, మే 16 : సింగరేణి ప్రధాన కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పర్సనల్ విభాగం జనరల్ మేనేజర్లతో సీఎండీ బలరాం శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ.. ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ నియామకాలు, విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగులపై తీసుకునే క్రమశిక్షణ చర్యలపై సమీక్షించారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలు, కారుణ్య నియామకాలు, పదవీ విరమణ పొందే ఉద్యోగుల సీఎంపీఎఫ్, పెన్షన్ గ్రాట్యుటీ చెల్లింపులు, సీపీఆర్ఎంఎస్, మెడికల్ కార్డులు, క్వార్టర్లు, ఉద్యోగుల పదోన్నతులు, పారిశ్రామిక సంబంధాలు వంటి అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జీఎంలు మనోహర్, కవితానాయుడు, కిరణ్‌కుమార్, ఏజీఎం మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్, హరీశ్‌రావులను కలిసిన కమల్‌రాజు



మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో కమల్‌రాజు

మధిర, మే 16 : హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులను ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక రాజకీయ పరిస్థితుల గురించి వారు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు, నాయకులు కేసీఆర్ నాయకత్వంలో ముందుకు సాగాలని, హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైన విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వారు సూచించినట్లు కమల్‌రాజు తెలిపారు.

# సన్నాలు సరే.. దొడ్డురకం!?

*చెమటోడ్చి పండించిన పంట కండ్ల ముందే మొలకెత్తుతున్నది. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం అకాల వర్షాలకు తడిసి ముద్దవుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం వరి ధాన్యాన్ని కొనే దిక్కులేకపోవడంతో రైతన్నలు దీనస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. బిక్కుబిక్కుమంటూ ఆకాశంవైపు చూస్తూ భయపడుతూ.. బాధపడుతూ కన్నీటి పర్యంతమవుతున్నారు. చచ్చీబతికీ సన్న రకం వడ్లను కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం వాటిని తరలించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నది. ఇక దొడ్డురకం ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా పూర్తిగా వదిలేయడంతో అన్నదాతల వ్యధ వర్ణించ తరంకావడం లేదు. దొడ్డురకం ధాన్యం కూడా కొనుగోలు చేస్తాం.. రైతులెవ్వరూ బాధపడొద్దని మాటలు చెబుతున్న అధికారులు అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప ఎక్కడా కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. ఎంతో కష్టపడి, పెట్టుబడి పెట్టి పండించిన పంటను సైతం అమ్ముకునే పరిస్థితి లేకపోవడంతో రైతన్నలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.*

*- అశ్వారావుపేట టౌన్, మే 16*

- ధాన్యం కొనుగోలులో సర్కార్ తీవ్ర జాప్యం
- ఆందోళనలో దొడ్డురకం ధాన్యం రైతులు
- అకాల వర్షాలకు మొలకెత్తుతున్న వడ్లు
- నెలరోజులుగా కొనుగోలు కేంద్రాలకే పరిమితం
- కుంటిసాకులు చూపి కొనుగోలు చేయని అధికారులు
- చేసేదిలేక నష్టానికి అమ్ముకుంటున్న అన్నదాతలు



అశ్వారావుపేట కొనుగోలు కేంద్రంలో తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

అశ్వారావుపేట సొసైటీ పరిధిలోని ఊట్లపల్లి, అశ్వారావుపేట, జమ్మిగూడెం గ్రామాల పరిధిలో రైతులు చెరువులు, బోర్ల కింద సన్నరకం వడ్లతోపాటు దొడ్డు రకం వడ్లను కూడా పండించారు. పండించిన పంటను సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించారు. సొసైటీ అధికారులు నిన్నటివరకు సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించారు. అయితే దొడ్డు రకం ధాన్యాన్ని మాత్రం కొనుగోలు చేయకుండా కాలయాపన చేస్తుండడంతో రైతులు మండిపడుతున్నారు. కష్టపడి పండించిన పంట అకాల వర్షాలకు తడిసి మొలకెత్తుతున్నదని త్వరగా కొనుగోలు చేయాలని అధికారులను వేడుకుంటున్నారు.

### ధాన్యాన్ని కొనేదిక్కు లేదు..

అధికారుల అలసత్వంతో కొనుగోలులో జాప్యం కారణంగా దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే మగ్గుతున్నది. అనేక పర్యాయాలు మా ధాన్యం కొనండి సారూ.. అంటూ అధికారులకు మొరపెట్టుకున్నా కుంటిసాకులు చూపుతూ తాత్సారం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ప్రైవేటు వ్యాపారులకు ధాన్యాన్ని అమ్ముకుంటున్న రైతులు

కోత కోసి కొనుగోలు కేంద్రాలకు తరలించి నేటికి 22రోజులు గడిచినా అధికారులు మాత్రం దయచూపడం లేదని మండిపడుతున్నారు. కోత కోసిన దగ్గర నుంచి పరదాలు కొనేవరకు ఎకరాకు రూ.15 వేలు ఖర్చు వస్తున్నదని రైతులు చెబుతున్నారు.

### దళారులకే అమ్ముకుంటున్న రైతులు..

కొనుగోలు కేంద్రాల్లో మగ్గుతున్న దొడ్డురకం ధాన్యం అకాల వర్షాలకు తడుస్తూ మొలకెత్తుతుండడంతో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. అధికారులను ప్రాధేయపడినా ఫలితం లేకపోవడంతో చేసేదిలేక దళారులకే ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. దీంతో బస్తాకు రూ.350 నుంచి రూ.400 వరకు రైతులు నష్టపోవాల్సి వస్తున్నది. ప్రభుత్వం సన్నరకానికి బోనస్‌తో కలుపుకుని బస్తాకు రూ.2,820 ఇస్తుండగా.. దొడ్డు రకం ధాన్యానికి రూ.2,300 ఇస్తున్నది. మిల్లులు ఖాళీ లేవనే సాకుతో దొడ్డురకం కొనుగోలు చేయడం లేదని చిన్నంశెట్టి రాంబాబు, కొత్త ప్రవీణ్ తదితర రైతులు వాపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రైతులకు ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### దిక్కులేక ప్రైవేటుకు అమ్ముకున్నా..



పదిహేను ఎకరాల్లో వరి సాగు చేసి పంటను అశ్వారావుపేట ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చా.. నేటికి 20రోజులు దాటినా పట్టించుకున్న నాధుడులేడు. శాంపిల్ పట్టుకెళ్లి 15 రోజులైంది. అకాల వర్షాలు పడుతున్నాయి. రాసుల్లో అడుగు ధాన్యం మొలకెత్తి పాడవుతున్నది. దీంతో చేసేదిలేక బస్తాకు రూ.350 తక్కువకు ప్రైవేటోళ్లకు అమ్ముకున్నాను.

**– కొత్తా ప్రవీణ్, రైతు, అశ్వారావుపేట**



అశ్వారావుపేట కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యంతో రైతులు

### రైతులను పురుగుల్లా చూస్తున్నారు..



వడ్లు రాసులుగా పోసి 20రోజులు అవుతున్నది. అధికారులు వచ్చి తిరిగి చూసివాళ్లే లేరు. ఫోన్‌లు చేసినా ఎత్తడం లేదు.. స్వయంగా కలిసి అడిగితే మిల్లుల దగ్గరకు వెళ్లి అమ్ముకోండి అని చెబుతున్నారు. రైతులను అధికారులు పురుగులను చూసినట్లు చూస్తున్నారు. రైతులు చేసేదిలేక ధాన్యాన్ని ప్రైవేటోళ్లకు నష్టానికే అమ్ముకుంటున్నారు.

**– చిన్నంశెట్టి రాంబాబు, రైతు సంఘం నాయకుడు, అశ్వారావుపేట**



పాల్వంచరూరల్ : శుక్రవారం భారీ వర్షం కురవడంతో రెడ్డిగూడెంలో ధాన్యం రాసులపై పట్టాలు కప్పిన రైతులు

### రెండ్రోజుల్లో కొంటాం..

మిల్లర్ల సమస్య తీవ్రంగా ఉంది. అయితే ఇప్పటికే మిల్లర్లతో మాట్లాడినం.. మరో రెండ్రోజుల్లో దొడ్డురకం ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం. రైతులు సమన్వయం పాటించాలి. ప్రైవేట్ వాళ్లకు అమ్ముకొని నష్టపోవద్దు.

**– మానేపల్లి విజయబాబు, అశ్వారావుపేట సొసైటీ సీఈవో**

# అనాసాగరం రైతుల ఆందోళన

- 1638 రకం కొనుగోలు చేయకపోవడంతో నిరసన
- తహసీల్దార్, ఏవో కార్యాలయాల వద్ద ధర్నా
- అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి హామీతో విరమణ



నేలకొండపల్లిలో రైతువేదిక వద్ద ధర్నా చేస్తున్న అనాసాగరం రైతులు

కూసుమంచి(నేలకొండపల్లి), మే 16 : కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకొచ్చి నెలపదిహేను రోజులవుతున్నా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో నేలకొండపల్లి మండలం అనాసాగరం గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం తహసీల్దార్, ఏవో కార్యాలయాల వద్ద ఆందోళన చేశారు. నెలపదిహేను రోజులుగా ధాన్యాన్ని కాపాడుకుంటున్న అన్నదాతలు శుక్రవారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో ఓపిక నశించి ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడించారు. ప్రభుత్వం అందించే బోనస్ రూ.500 చొప్పున వస్తుందనే ఆశతో రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చారు. కానీ.. మిల్లర్లు 1638 రకం ధాన్యం కొనుగోలు చేయడం లేదు. అంతేకాక ధాన్యం కాంటా వేయడానికి గన్నీ బ్యాగులు లేకపోవడం, కాంటా వేసిన ధాన్యం తరలించేందుకు లారీలు రాకపోవడం, ఇంకా 15 లారీలకు పైగా ధాన్యం కాంటా పెట్టాల్సి ఉండడం.. ఈలోగా శుక్రవారం వర్షం కురవడంతో రైతులు ఆందోళనకు దిగారు. గ్రామానికి చెందిన సుమారు 50 మంది ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి రైతులతో ఫోన్‌లో మాట్లాడారు. గన్నీ బ్యాగులు వెంటనే పంపించి కాంటా వేయిస్తామని, 1638 రకం కొనుగోళ్లలో కొంత ఆలస్యం జరిగిందని, ఆ ధాన్యం పూర్తిగా కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.



### నెలపదిహేను రోజులుగా ఎదురుచూస్తున్నా..

నాకు 500 టిక్కీల ధాన్యం పండింది. అమ్ముకునేందుకు నెలపదిహేను రోజుల కిందట కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చా. తేమశాతం సరిగానే వచ్చింది అయినా రేపు.. మాపు అంటూ కాంటాలు వేయడం లేదు. అకాల వానలతో చాలా ఇబ్బంది పడుతున్నాం. ప్రతిరోజు కాపలాకాయాల్సి వస్తున్నది. ఇకనైనా ధాన్యం కొంటే బాగుండు. **– జోగుపర్తి వెంకటనారాయణ, రైతు, అనాసాగరం**

### రైతులందరం నిరసన తెలిపాం..



ధాన్యం అమ్ముకోవాలని సుమారు 45రోజులుగా ఎదురుచూస్తున్నాం. 1638 రకం మిల్లర్లు కొనుగోలు చేయడం లేదు. వర్షాలు పడుతుండడంతో ఇంకా ఓపిక పట్టలేక తహసీల్దార్, వ్యవసాయశాఖ కార్యాలయాల వద్దకు వెళ్లి రైతులందరం నిరసన తెలిపాం. అదనపు కలెక్టర్ సారు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించాం. అనాసాగరంలో ఎక్కువ మంది 1638 రకమే వేశారు. మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. **– పాపిని వెంకటనారాయణ, రైతు, అనాసాగరం**



పట్టాలపై వర్షపు నీటిని తొలగిస్తున్న రైతులు

# మద్దతు ధరకు కొనుగోలు చేస్తాం..

## వీసీలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



వీసీలో పాల్గొన్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, మే 16 : యాసంగిలో రైతులు పండించిన ధాన్యం మద్దతు ధరతో చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి మంత్రి.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్‌తో కలిసి ధాన్యం కొనుగోలుపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి వీసీలో పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, జిల్లా సహకార అధికారి గంగాధర్, డీఆర్‌డీవో సన్యాసయ్య, జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ.అలీమ్, అధికారులు పాల్గొన్నారు.



పాల్వంచలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

# 'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలి

## పాల్వంచలో ప్రజా సంఘాల శాంతి ర్యాలీ

పాల్వంచ, మే 16 : మావోయిస్టులను అణచివేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరుతూ వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్వంచలో శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కాల్పుల విరమణ ప్రకటించి, శాంతి చర్చలకు రావాలని మావోయిస్టు నేతలు ప్రకటనల ద్వారా కోరుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ప్రశాంత వాతావరణంలో మావోయిస్టులతో చర్చలు జరపాలని వారు కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు దేవదానం, గౌని నాగేశ్వరరావు, జడ సీతారామయ్య, శనగ రాంచందర్, నిమ్మల రాంబాబు, మంజూర్, ఉపేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# అవాంతరాలు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

## వీసీలో వివరించిన కలెక్టర్ జితేశ్ వి పాటిల్




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, మే 16 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియలో అవాంతరాలు లేకుండా సాఫీగా కొనసాగుతున్నట్లు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ పారదర్శకంగా నిర్వహించి.. 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో కలిసి పాల్గొన్న కలెక్టర్.. జిల్లాలో కొనుగోలు ప్రక్రియ గురించి మంత్రికి వివరించారు. జిల్లాలో ఇప్పటికే 34,300 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి రైతుల ఖాతాల్లో ఎప్పటికప్పుడు డబ్బులు జమ చేశామని పేర్కొన్నారు. ధాన్యం ఎంత వచ్చినా చివరి గింజ వరకూ కొనుగోలు చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రానున్న పది రోజుల్లో జిల్లాలో మిగిలిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను కూడా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, పౌరసరఫరాల అధికారి రుక్మిణి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ త్రినాథ్‌బాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు తదితరులు పాల్గొన్నారు.